
విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని మంత్రి సీతక్క అన్నారు. హనుమకొండలోని తిరిదే కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో 'భాషోత్సవ్' పేరిట ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారి అభ్యున్నతికి పాటుపడతారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ పాటు పడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 వేల పోలీసు, 1,637 ఇంజినీర్, డీఎస్సీ ద్వారా 11,067 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. భారాస ప్రభుత్వ పదేళ్ల పాలనలో యువతను మోసం చేసిందన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. శ్రీహరి రచించిన భక్తి గీతాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, శంకర్‌రావు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని

పెద్దదిక్కు లేక.. కన్నీళ్లు ఆగక!

అన్నదాతల ఆత్మహత్యలు.. కుటుంబాల్లో కల్లోలం



ఆరుగాలం కష్టపడుతూ.. చెమట ధారలతో నేలను తడుపుతూ సాగునే నమ్ముకున్న అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న సాగు పెట్టుబడులు.. కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. వైద్య ఖర్చులకు చేస్తున్న అప్పులు తీరక తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పది నెలల కాలంలో దాదాపు 25 మంది దాకా బలవన్మరణాలకు పాల్పడటం కలవరపెడుతోంది. వీరిలో కౌలు రైతులు కూడా ఉన్నారు. యువ రైతులు సైతం బలవన్మరణం చెందడంతో చిన్నతనంలోనే వితంతువులుగా మారిన మహిళలు అప్పులు ఎలా తీర్చాలో.. పిల్లలను ఎలా పెంచి పెద్దచేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాల దయనీయ పరిస్థితిపై కథనం.
ఈనాడు, మహబూబాబాద్

కౌలు రైతు కుటుంబం.. కష్టాలపాలు



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లికి చెందిన పోశాల రాజబాబు(45) వ్యవసాయంపై మక్కువతో పదేళ్లుగా మూడెకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేసేవారు. ఆశించిన దిగుబడులు రాక, అప్పులు పెరిగి సుమారు రూ.15 లక్షలకు చేరాయి. కుటుంబ పోషణ భారంగా మారడంతో రాజబాబు మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారులు సుశాంత్, అభిరామ్ చదువుల ఖర్చులతోపాటు అప్పులను తీర్చే బాధ్యత తనపై పడిందని.. కూలీ పనులకు వెళ్లినా కష్టాలు తీరేలా లేవని భార్య సువర్ణ రోదిస్తోంది. – వర్ధన్నపేట

అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక..



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆరెపల్లికి చెందిన గువ్వాడి మోహన్‌రావు(32), భార్య కృష్ణవేణి(28) మూడెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేసేవారు.. దీంతోపాటు మోహన్‌రావు వరంగల్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తుండేవారు. సాగు పనులకు రూ.8 లక్షల మేర అప్పు చేశారు. మోహన్‌రావు రోజు పనికి వెళ్లిన తర్వాత.. అప్పులోళ్లు ఇంటికి వచ్చి అడుగుతుండటంతో భరించలేక మద్యం తాగడం ప్రారంభించారు. అప్పులు తీర్చే మార్గం లేక మార్చి 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దిక్కుతోచని పరిస్థితిలో కృష్ణవేణి ఏడేళ్లు, రెండున్నరేళ్ల పిల్లలను నాన్నమ్మ వద్ద ఉంచి కూలీకి వెళ్తోంది. – గీసుకొండ

అప్పుడు కూతురు.. ఇప్పుడు తండ్రి



భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన కొండ రాజబాపు(45) కౌలు రైతు.. నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశారు. సుమారు రూ.11 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. ఆశించిన దిగుబడులు రాకపోవడం.. కుటుంబ పోషణ భారమవుతుండటంతో వేదనతో రాజబాపు పురుగు మందుతాగి ఈ నెల 6న మృతి చెందారు. మూడేళ్ల కిందట పదో తరగతి చదువుతున్న కూతురు.. ఇప్పుడు ఇంటి యజమాని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. అప్పులు, కుమారుడికి చదువులు చెప్పించే బాధ్యత భార్య రాజేశ్వరిపై పడింది. కష్టాలు గట్టెక్కేందుకు గ్రామంలో కూరగాయలు విక్రయిస్తున్నానని.. కన్నీరు పెట్టుకుంది. –కాటారం

నమ్ముకున్న చేనులోనే..



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పల్గుల గ్రామానికి చెందిన పలిశెట్టి మొండయ్య(45) ఆరెకరం భూమిలో పత్తి సాగు చేశారు. భార్య లావణ్య కూలి పనులకు వెళ్లేది. మూడేళ్ల నుంచి గోదావరి వరద ముంపుతో సాగు చేసిన పత్తిలో దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పెట్టుబడి, ఇంటి పోషణకు చేసిన రూ.8 లక్షల అప్పులో రూ.4 లక్షలు తీర్చారు. మిగతావి తీర్చేందుకు ఇబ్బందులు ఎదురవడంతో మనోవ్యథకు గురై మొండయ్య పంట చేలోనే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. లావణ్య బాధను దిగమింగుతూ రోజూ కూలీ పనులకు వెళ్తోంది. – కాళేశ్వరం

పరిష్కారాలు ఇలా..

- వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలి.
- మిర్చి, పత్తి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ముందస్తు సూచనలు చేయాలి.
- ఎరువులు, పురుగు మందుల ధరలు నియంత్రించి రైతులపై భారాన్ని తగ్గించాలి
- ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి.

భూమి అమ్మి తీర్చేందుకు..



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హరిదాస్‌తండా పంచాయతీ శివారు హర్యాతండాకు చెందిన భూక్యా హత్తీరాం(33), భార్య మీన(28) ఎకరంన్నర భూమికి తోడుగా మరో ఎకరంన్నర కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మిరపసాగు చేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మిరప తోటలో నీటి ఊట పెరిగి వేరుకుళ్లు తెగులు సోకి పంటంతా ఎండిపోయింది. పెట్టుబడికి రూ.2.50 లక్షలు, అంతకుముందు చేసిన పాత అప్పులు రూ.4 లక్షలు తీర్చడం కష్టంగా భావించిన హత్తీరాం మనస్తాపంతో సెప్టెంబరు 6న పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాటి నుంచి మీన కుటుంబ బాధ్యతను తీసుకుని రూ.40 వేలు అప్పు చేసి మళ్లీ మిరప సాగు చేస్తోంది. అప్పులు తీర్చడానికి 20 గుంటల భూమిని విక్రయించాలని అనుకుంటున్నానని రోదిస్తూ చెప్పింది. – కురవి

రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూపాలపల్లి

వ్యవసాయంలో ఒడుదొడుకులు సహజం.. అనుకున్న దిగుబడి రాకపోవడం, అకాల వర్షాలు, వరదలతో పంట మునగడం వంటి సందర్భాల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాఖ తరఫున సిద్ధంగా ఉన్నాం. చాలా మంది అన్నదాతలు అర్హత ఉండీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవడం లేదు.. పంట సాగుకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి వేధింపులతో వ్యాపారి ఆత్మహత్య

● న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన


ఉపాధ్యాయుడి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయుడి వేధింపులతో ఆత్మహత్యకు యత్నించిన వ్యాపారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. న్యాయం చేయాలని కోరుతూ మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన హనుమకొండలోని గోకుల్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. వ్యాపారి మాడిశెట్టి రాంబాబు(50) హనుమకొండలోని రాంనగర్‌లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈయనకు గోకుల్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంబాటి రమేష్‌తో పరిచయం ఉంది. రమేష్ 2019లో విష్ణు అనే వ్యక్తికి రూ.3 లక్షల అప్పు ఇచ్చారు. ఈ వ్యవహారంలో రాంబాబు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ఆ తర్వాత విష్ణు కనిపించకుండా పోవడంతో అప్పు చెల్లించాలంటూ ఉపాధ్యాయుడు రమేష్ రాంబాబుపై ఒత్తిడి తెచ్చి వేధింపులకు గురి చేశారు. అంతేకాక తన బంధువు, పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌కు చెప్పి రాంబాబును బెదిరించాడని వ్యాపారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో ఈనెల 16న రాంబాబు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 19వ తేదీ రాత్రి మృతి చెందాడు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యాపారి కుటుంబ సభ్యులు, బంధువులు.. గోకుల్‌నగర్‌లోని రమేష్ ఇంటి ఎదుట ఆదివారం మధ్యాహ్నం ధర్నా చేశారు. ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విప్లవ సాంస్కృతిక ఉద్యమంతోనే మార్పు


మాట్లాడుతున్న ఏపీ అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, వేదికపై నాగన్న, గోవర్ధన్ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశంలో పెచ్చరిల్లుతున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు, భూస్వామ్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంతో ముందుకు సాగాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.జాలన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న పిలుపునిచ్చారు. నర్సంపేటలోని రాయల రమేశ్ నగర్(సిటిజన్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో వారు పాల్గొని మాట్లాడారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా బలమైన విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించి. . తద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రజా కళలు అంతరించడం వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. 'కళ కాసు కోసం కాదని.. అది ముమ్మాటికి ప్రజల కోసమని' పేర్కొన్నారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమం కోసం పోరాడి అమరులైన వారికి జోహార్లు అర్పించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా సభావేదిక వరకు ప్రదర్శనగా వచ్చారు. సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, ఆహ్వాన సంఘం నాయకులు డా.జగదీశ్వర్, ఐలయ్య, ప్రముఖ కవి, రచయిత యోచన, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, అరుణోదయ సమాఖ్య నాయకులు అలీ, కోటేశ్వర్‌రావు, ఆహ్వాన సంఘం సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-I పరీక్షలు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలను సోమవారం నుంచి ఈ నెల 28 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 8, 10 తరగతుల విద్యార్థులకు 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు, 7, 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అన్ని పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్

సుబేదారి, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. పురస్కారాలు, పదోన్నతులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు శాలువాలు కప్పి సన్మానించారు. తెలంగాణ పద్మశాలి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పద్మశాలి పేద విద్యార్థులకు చదువులకు ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. పద్మశాలీలు ఐక్యంగా ఉండి వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వరంగల్ జిల్లా రెండో తరగతి మేజిస్ట్రేట్ వీరస్వామి, గుండు ప్రభాకర్, కుసుమ సత్యనారాయణ, వేముల నాగరాజు, ఈగ వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో గడ్డం కేశవమూర్తి, మధుసూదన్, నవీన్, రాజ్‌కుమార్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏలు మంజూరు చేయాలి

గోపాలపూర్,న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఉద్యోగులు, పింఛనుదారులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రబెల్లి కమలాకర్‌రావు, నారాయణగిరి వీరన్నలు డిమాండ్ చేశారు. హనుమకొండలోని విద్యారణ్యపురి బ్యాంకుకాలనీలో ఆదివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఉద్యోగులు, పింఛనుదారులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడంతో ఉద్యోగులు, పింఛనుదారులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతుందన్నారు. ఆర్థిక కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ డీఏల మంజూరు, పింఛనుదారుల సమస్యలపై ఉద్యమం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు భట్టర్, రాజయ్య, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమారంలోని కేఎల్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం మాల, మాల ఉపకులాల, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, కేఆర్ నాగరాజుతో కలిసి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి పాల్గొన్నారు..
వివరాలు 14వ పేజీలో..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు


ఎంజీఎం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.మురళితో చర్చిస్తున్న రాష్ట్ర ప్రత్యేక టాస్క్‌ఫోర్సు సభ్యుడు జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించింది. వైద్యఆరోగ్యశాఖ పరిపాలనా విభాగం జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ బృందం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితో పాటు దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం, హనుమకొండలోని లష్కర్‌సింగారం, పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రాలను, హనుమకొండలోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను తనిఖీ చేశారు. మందుల నిల్వల వివరాలు తెలుసుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో మందుల నిల్వల గదిని పరిశీలించిన అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ మురళితో మాట్లాడారు. ఈ-ఔషధి సక్రమంగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు, సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తనిఖీల్లో ఉస్మానియా ఆసుపత్రి డా.అహ్మద్, వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలు డా.వెంకటరమణ, డా.లలితాదేవి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ ఇన్‌ఛార్జి ఫార్మాసిస్టు భాస్కర్‌రావు తదితరులున్నారు.

ఎదుగుదల లోపం.. బాల్యానికి శాపం

బడికెళ్తున్న బాల్యం బలహీనపడుతోంది. పోషకాహార లోపం, రక్తహీనత, దృష్టి, వినికిడి లోపం వంటి ఎన్నో రుగ్మతలతో బాధపడుతున్నారు. కండరాల సమస్యతో ఎదుగుదల తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా.. అవగాహన లోపం, అందని పౌష్టికాహారం వారిని మరింత బలహీనుల్ని చేస్తోంది. పరుగులిడాల్సిన వయసులో నీరసం, నిట్టూర్పులు మిగులుతున్నాయి. పేదరికం ఒక శాపమైతే.. సరైన వైద్యం అందకపోవడం మరో శాపగ్రస్తమైంది. జిల్లాలో ఈ సంవత్సరం జులై నుంచి సెప్టెంబరు వరకు నిర్వహించిన రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమంలో బాలల ఆరోగ్యం ఆందోళన కలిగించేదిగా ఉన్నట్లు స్పష్టమైంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి


వినికిడి లోపం ఉన్న పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్యురాలు

పిల్లల్లో గుర్తించిన ఆరోగ్య సమస్యలు	
చీలిక పెదవి	3
పాదాల వంకర	3
పుట్టుకతో కంటి శుక్లాలు	16
పుట్టుకతో గుండెజబ్బులు	9
వినికిడి లోపం	104
తీవ్రమైన రక్తహీనత	126
తీవ్రమైన పోషకాహార లోపం	27
తీవ్రమైన సన్నబడటం	5
చర్మ సమస్యలు	47
కర్ణభేరి ఇబ్బందులు	8
దంత సమస్యలు	490
దృష్టిలోపాలు	106
నరాలు, కండరాల బలహీనత	60
ఎదుగుదల లోపం	47
బుద్ధిమాంద్యం	79
భాష ఆలస్యం	87
అభ్యాస రుగ్మత	110
ప్రవర్తన రుగ్మత	72
శ్రద్ధ లోటు	22
రుతుక్రమం ఆలస్యం, ఇతర సమస్యలు	63

కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లోని పిల్లలకు ఆరోగ్య భద్రత కల్పించడంలో భాగంగా రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాలో ఐదు వైద్య బృందాలు పనిచేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఏఎన్ఎం, ఒక ఫార్మసిస్టు ఉంటారు. ఈ బృందంలోని వైద్యులే అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం కింద పిల్లలకు వైద్యసేవలు అందిస్తారు. సుమారు 32 అంశాలపై విద్యార్థులకు పరీక్షలు చేసి లోపాలను గుర్తిస్తారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఎంజీఎం ఆసుపత్రిలోని డైయిక్ కేంద్రానికి రిఫర్ చేయాలి. అక్కడ ఉన్న వైద్యులతోపాటు, ఎంజీఎంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యనిపుణులతో పిల్లలకు మెరుగైన చికిత్స అందించడం ఈ పథకం లక్ష్యం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావొస్తుండగా ఇప్పటివరకు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు పూర్తిచేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఎంజీఎం డైయిక్ కేంద్రంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఇప్పటివరకు జరిగిన వైద్య పరీక్షల వివరాలు

- మొత్తం పాఠశాలలు, వసతి గృహాలు: 638
- అంగన్‌వాడీ కేంద్రాలు: 916
- వైద్యపరీక్షలు నిర్వహించాల్సిన బాలలు: 58,303
- గత మూడు నెలల్లో నిర్వహించిన పాఠశాలలు: 250
- వైద్యశిబిరాలు నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాలు: 97
- వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థుల సంఖ్య: 26,124
- మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసిన పిల్లల సంఖ్య: 1,865

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ ప్రకాష్, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త

ఎదిగే వయసులో పిల్లలకు పోషకాహారం అందేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. రక్తహీనత కలగకుండా ప్రతిరోజు ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, పండ్లు, ఆహారంలో తప్పనిసరి. కంటిచూపు తగ్గకుండా ప్రతి రోజు తీసుకునే ఆహారంలో విటమిన్ ఎ ఉండే ఆహారం తీసుకోవాలి. ప్రస్తుతం వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు జిల్లా డైయిక్ కేంద్రానికి వారంలో ఒక రోజు తీసుకొచ్చి నిపుణులైన వైద్యుల ద్వారా పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం.

అరకొర గదులు.. చెట్ల కిందే పాఠాలు



ఆత్మకూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (గొల్లవాడ)లో 75 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. రెండు తరగతి గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉపాధ్యాయులు పిల్లలకు ఆరుబయట చెట్ల కిందే పాఠాలు బోధిస్తున్నారు. భోజనశాల కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే భోజనం చేస్తున్నారు. పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు (పరకాల)

సేవలు అమరం.. త్యాగం మరవం





● నేటి నుంచి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు

పోలీసులు సమాజ రక్షకులు.. విధి నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. అనేక త్యాగాలు చేస్తారు. ప్రజలందరూ సంతోషంగా పండగలు జరుపుకొంటే ఆ సమయాల్లో తాము మాత్రం ప్రత్యేక విధులు నిర్వహిస్తారు. శాంతి భద్రత పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయరు. విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రధాన ఘటనలపై 'న్యూస్‌టుడే' కథనం.

వరంగల్‌క్రైం, వర్ధన్నపేట, న్యూస్‌టుడే

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలిజం ఎక్కువగా ఉండేది. పోలీసులు, నక్సల్స్ మధ్య నిరంతరం ఎదురుకాల్పులు జరిగేవి. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎస్పీ నుంచి హోంగార్డు వరకు 61 మంది పోలీసులు అమరులయ్యారు. ప్రాణత్యాగం చేసిన వారిలో అయిదుగురు హోంగార్డులు ఉన్నారు.

ఠాణాలపై దాడులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులపై దాడులతో పాటుగా ఠాణాపై దాడులు చేసేవారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఠాణాపై 2001 జులై 29న మావోయిస్టులు దాడి చేసి పేల్చేశారు. ఈ ఘటనలో ఠాణాలో పనిచేస్తున్న మోహన్‌నాయక్ మృతిచెందాడు. పక్కనే ఉన్న దేవాలయంలోని పూజారితో పాటు అటవీ శాఖ సిబ్బంది ఒకరు చనిపోయారు. 1991 ఏప్రిల్ 22న నగరం నడిబొడ్డున ఉన్న సుబేదారి ఠాణాను పేల్చేశారు. హెడ్‌కానిస్టేబుల్ టి.సారయ్య, కానిస్టేబుల్ కోటయ్య మృతిచెందారు. హనుమకొండ ఠాణాపైనా మావోయిస్టులు దాడి చేశారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పటి సీఐ గులాంసందానీ లక్ష్యంగా మావోయిస్టులు ఠాణాను పేల్చేశారు. ఈ ఘటనలో ప్రస్తుతం సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న శివకుమార్ గాయపడ్డారు.

భార్యాబిడ్డలకు టాటా చెబుతూనే..

1997లో వర్ధన్నపేట ఠాణా ఎస్సైగా పనిచేస్తున్న రఘును నక్సల్స్ కాల్చి చంపారు. 1992లో పోలీసు ఉద్యోగంలో చేరిన రఘు ఉమ్మడి జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. వర్ధన్నపేట ఎస్సైగా ఉన్న సమయంలో 21-11-1997న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. అదేరోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఠాణాకు వెళుతూ.. కూతురు, భార్యకు టాటా చెబుతుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి తుపాకీతో కాల్చారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భార్యాబిడ్డల ముందే తుదిశ్వాస విడిచారు. ఆయన వీర మరణానికి గుర్తుగా వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో కొంత స్థలాన్ని పార్కుగా ఏర్పాటు చేసి రఘు పేరు పెట్టారు.



వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పార్కు

1991లో తొలి పేలుడు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1991 జూన్ 15న మొదటిసారిగా మందుపాతర పేలింది. మధ్యంతర ఎన్నికల సమయంలో ఏటూరునాగారం మండలం చెల్పాక గ్రామంలో ఎన్నికల విధుల కోసం వెళ్తున్న సమయంలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్సై కిషోర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటుగా అయిదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందారు.

జాకారం వద్ద మందుపాతర

ప్రస్తుత ములుగు జిల్లా జాకారం వద్ద 1996 అక్టోబరు నెలలో జరిగిన మందుపాతర పేలుళ్లలో ఏడుగురు పోలీసులు మృతిచెందారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా బందోబస్తుకు వెళుతున్న ట్రాఫిక్ సీఐ ఆకుల దామోదర్‌రావు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు జకారం వద్ద పేల్చేశారు. ఇందులో దామోదర్‌తో పాటుగా హెడ్ కానిస్టేబుల్ జి.సారయ్య, కానిస్టేబుళ్లు ఎండీ మహమ్మద్ ఖాన్, డి.వినాయకరావు, పాశికంటి రమేశ్, సి.గోవర్ధన్, ఎం.అశోక్ మృతిచెందారు.

● 1992లో స్టేషన్‌ఘన్‌పూర్ విశ్వనాథపురం వద్ద జరిగిన బాంబు పేలుడులో 13 మంది మృతిచెందారు. ఇందులో 12 మంది బీఎస్ఎఫ్ జవాన్లు కాగా ఒకరు డ్రైవర్ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అతిపెద్ద విధ్వంసంగా పోలీసులు ఈ ఘటనను పేర్కొంటారు.

మాటువేసి మట్టుబెట్టారు..

భూపాలపల్లిలో 2001 సంవత్సరంలో సీఐగా పనిచేస్తున్న వివేకానందను నక్సల్స్ కాల్చి చంపారు. 1985లో పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన వివేకానంద నగరంతో పాటు జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా పనిచేశారు. సీఐగా పదోన్నతి రావడంతో బదిలీపై భూపాలపల్లికి వచ్చారు. సింగరేణి అతిథి గృహంలో రాత్రి భోజనం ముగించుకొని జీపులో ఠాణాకు వెళుతుండగా.. మార్గమధ్యలో మాటు వేసిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారి వచ్చి నేరుగా సీఐపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.



ప్రభుత్వ ప్రయోజనాలు

● మావోయిస్టుల చేతిలో మృతిచెందిన అమరవీరుల కుటుంబ సభ్యుల్లో అర్హత ఉన్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తారు.
● సర్వీస్ కాలం వేతనం మృతుడి సతీమణికి చెల్లిస్తారు.
● ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇస్తారు.
● ఇంటి స్థలం మంజూరు చేస్తారు.
● 2005లో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పాటైంది. దీని ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఏర్పాట్లు చేశాం..



- అంబర్ కిశోర్ ఝా, పోలీసు కమిషనర్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు ఓపెన్ హౌజ్ లాంటి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోలీసుల విధులు, కర్తవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఈ నెల 22న హనుమకొండ, 23న వరంగల్, 24 మామునూరు, 25వ తేదీ పోలీసు కమిషనరేట్, 26న వర్ధన్నపేట, 27 స్టేషన్‌ఘన్‌పూర్, 28 నర్సంపేట, 29 పరకాల, పోలీసు డివిజన్ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం.

పైపులైన్ పగిలి.. భారీగా తాగునీటి వృథా



ఖమ్మం రోడ్డులో పెట్రోల్ పంపు ఎదుట..



మాజీ ఎమ్మెల్యే నరేందర్ నివాసం ముందు రోడ్డుపై..

వరంగల్ జిల్లా ఇసుకఅడ్డా ఖమ్మం రోడ్డులోని పెట్రోల్ పంపు ఎదుట శనివారం అర్ధరాత్రి బల్దియా ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో పెద్దఎత్తున తాగునీరు వృథా అయ్యింది. అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు లీకేజీ వరద ఆగలేదు. భారీ వర్షం పడినట్లు తాగునీరు ఏరులై పారింది. ఇసుకఅడ్డా నుంచి వరంగల్ అండర్‌బ్రిడ్జి మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటివరకు నీరు నిలిచింది. లీకేజీని బల్దియా అధికారులు గుర్తించినా.. రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేయడం వల్ల ప్రధాన పైపులైన్‌కు పడిన లీకేజీని నియంత్రించడం కష్టమైంది. ఆదివారం సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేశాక.. లీకేజీ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, శివనగర్(వరంగల్)

రైతు ఇంట.. కొలువుల పంట

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : ఓ రైతు కుటుంబం ఇంట.. కొలువుల పంట పండుతోంది.. ఆరుగాలం కష్టించి కుమారులను చదివిస్తే వారిద్దరూ పోటీ పడుతూ వరుసగా కొలువులు సాధిస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన కౌడగాని మైసారావు వినోద దంపతుల కుమారులు మనోజ్, మధు ఒకరు మూడు, మరొకరు నాలుగు ఉద్యోగాలు సాధించి ప్రశంసలందుకుంటున్నారు. చిన్న కుమారుడు మధు ఈ ఏడాది జులై 20న సింగరేణి నిర్వహించిన జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షకు హాజరై ఈ నెల 18న వెలువడిన ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆయన 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై కొంతకాలం విధులు నిర్వహించారు. ఆ వెంటనే న్యాయస్థానం నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై జనగామ కోర్టులో పనిచేశారు. తర్వాత హైకోర్టు నిర్వహించిన ఎగ్జామినర్ పరీక్షరాసి ఉన్నత ఉద్యోగం సాధించి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అంతటితో ఆగకుండా పెద్ద ఉద్యోగంలో చేరాలనే పట్టుదలతో సింగరేణిలో జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షలో నెగ్గాడు.. పెద్ద కుమారుడు మనోజ్ తమ్ముడు మధుతోపాటే పంచాయతీ కార్యదర్శి కొలువు సాధించారు. మెరుగైన ఉద్యోగం కోసం సాగునీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. విధులు నిర్వహిస్తూనే.. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని మండల గణాంకాధికారి(ఎంపీఎస్‌వో) పరీక్ష రాసి అంతకంటే పెద్ద ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆయన దేవరుప్పుల మండల రెవెన్యూ కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్యం, పట్టుదల ఉంటే ఉద్యోగ పరీక్షలు ఎంత కఠినమైనా సాధించవచ్చని సోదరులు మధు, మనోజ్ తెలిపారు.



తల్లిదండ్రులతో కుమారులు మధు, మనోజ్

పర్యాటక ప్రాంతాల సందర్శన

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో ఆదేశాల మేరకు రామప్పలో కొనసాగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్లు ఆదివారం రామప్ప నుంచి పాండవులగుట్ట, కోటగుళ్ల సందర్శన చేశారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరో రోజు ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం పర్యాటక ప్రాంతాల సందర్శన చేశారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్ట చేరుకున్నారు. పాండవుల గుట్ట ప్రాశస్త్యం గురించి స్వయంగా తెలుసుకున్నారు. అక్కడ నుంచి గణపురంలోని కాకతీయ కట్టడమైన కోటగుళ్లను పరిశీలించారు. ఆలయ నిర్మాణం, ప్రత్యేకతను చూశారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గణపురం కోటగుళ్లలో శిక్షణ శిబిరం వాలంటీర్లు

కుటుంబ నిర్ధారణ.. 75 శాతమే!

● 12 వేల మంది రైతుల వివరాలు లేవు..

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

రుణమాఫీ కాని అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయగా.. చాలా మందికి వర్తించలేదని ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమం చేపట్టారు. శనివారంతో ఈ కార్యక్రమం పూర్తికాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 శాతమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 81 శాతం జరగ్గా, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 60 శాతమే పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 48,297 కుటుంబాలకు గాను 36,279 కుటుంబాల నిర్ధారణ పూర్తయింది.. ఇంకా 25 శాతం మిగిలిపోవడం గమనార్హం.. వారందరికీ రుణమాఫీ కానట్లేనని అధికారులు అంటున్నారు. మరోవైపు వందశాతం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పూర్తయ్యేదని అన్నదాతలు అంటున్నారు.

రూ.2312.01 కోట్ల రుణమాఫీ

రుణమాఫీకి సంబంధించి మూడు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2.63 లక్షల మంది రైతులకు రూ. 2312.01 కోట్లను మాఫీ చేశారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 59,140 మంది అన్నదాతలకు రూ. 516.91 కోట్లు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 18,696 మంది రైతులకు రూ. 165.53 కోట్లు మాఫీ అయ్యాయి.

క్షేత్రస్థాయిలో ఇలా..

రైతు పంట రుణమాఫీ కార్యక్రమానికి సంబంధించి పథకానికి అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ చాలా మంది రైతులకు వర్తించలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అర్హులైన కుటుంబాల నిర్ధారణ చేపట్టారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి పంచాయతీ, రైతు వేదికల్లో రేషన్ కార్డులేని కుటుంబ సభ్యుల నిర్ధారణ చేపట్టారు. కుటుంబ సభ్యులందరితో సెల్ఫీ తీసుకుని ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.



భూపాలపల్లిలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలు

జిల్లా	కుటుంబ సభ్యుల లక్ష్యం	నమోదు	శాతం	రుణమాఫీ పొందిన రైతులు	రుణం మొత్తం (రూ. కోట్లలో)
హనుమకొండ	8359	6934	79.30	49598	408.18
భూపాలపల్లి	5815	4713	81.04	22357	277.31
వరంగల్	8252	6263	75.90	59640	474.76
జనగామ	9947	7762	78.03	54458	469.32
మహబూబాబాద్	10937	6652	60.82	59140	516.91
ములుగు	4987	3955	79.30	18696	165.53

● జిల్లా ● కుటుంబ సభ్యుల లక్ష్యం ● నమోదు ● శాతం ● రుణమాఫీ పొందిన రైతులు ● రుణం మొత్తం (రూ. కోట్లలో)

పూర్తికాకపోవడానికి కారణాలివే..

● సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు గ్రామానికి వెళ్లిన సందర్భంలో సదరు రైతు కుటుంబం ఇతర ప్రాంతాల్లో ఉండటం.. వారికి సమాచారం అందించినా రేపు, మాపు అంటూ దాటవేస్తుండటం.
● రుణమాఫీ మరణించిన వ్యక్తులపై ఉండటంతో వారి మరణ ధ్రువపత్రం అందించడంతో పాటు ఆధార్ కార్డు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. మరణించిన వ్యక్తి ధ్రువపత్రం సదరు కుటుంబ సభ్యులు సకాలంలో అందించకపోవడం.
● రుణమాఫీలో విదేశాల్లో ఉంటున్న వారి పేర్లు కూడా ఉన్నాయి. అలాంటి వారు ఇక్కడకు వచ్చి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడం.
● ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కుటుంబ నిర్ధారణకు సంబంధించి సమాచారం అందించినా స్థానికంగా లేకపోవడం, ఆధార్ సమస్య, ఆదాయ పన్ను కడుతున్నవారు ముందుకు రాలేకపోయారని అన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖంత్ మైదానంలో నిర్వహించిన పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన జట్లు హాజరయ్యాయి. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓరుగల్లులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మైదానం నిర్మాణం ఆవశ్యకతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, రఘురాం, ఉపేందర్, వెంకటేశ్వర్‌రావు, అభినవ వినయ్, మట్టెడ కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ జట్టు గెలుపు

హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వరంగల్, మహబూబాబాద్ జట్లు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మహబూబాబాద్ జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి విజయం సాధించింది.

హనుమకొండ ఘన విజయం

మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హనుమకొండ, జనగామ జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హనుమకొండ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 307-10 పరుగులు చేసింది. జట్టులో రోహిత్‌రెడ్డి 84, వశిష్ట 49 పరుగులతో రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జనగామ జట్టు 27 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది.



ఆట ఆడేస్తా!

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఆదివారం మంత్రి సీతక్క సందడిచేశారు. బాల్య స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఆమె స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అప్పుడే మైదానంలోకి వచ్చిన పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన వంటలు పరిశీలించి పరిశుభ్రంగా, రుచిగా వండాలని అక్కడి సిబ్బందికి సూచించారు. – న్యూస్‌టుడే, తాడ్వాయి

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంచరీ (ఏటీసీ) కోర్సులను ఏర్పాటు చేయనుంది. తొలి విడతలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఈ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌డీడీ సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని బలంగా ఢీకొనగా, ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన చీరోలు భరత్(22)లు కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ గుత్తేదారు కింద ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సొంత పనుల నిమిత్తం దేవరుప్పులకు వచ్చే క్రమంలో గొల్లపల్లి శివారు వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొనడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బోయ నర్సింహ, చీరోలు భరత్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ట్రాలీలో ప్రయాణిస్తున్న కొంగరి భాస్కర్, రాపాక రేణుక, రాపాక ఉప్పలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టెండరు నిబంధనలు.. తుంగలో తొక్కుతున్నారు!

కార్పొరేషన్, న్యూస్‌టుడే

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా)లో అభివృద్ధి పనుల టెండర్ల కేటాయింపు ఇష్టారాజ్యంగా జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టెండరు నిబంధనలు పక్కన పెట్టేసి సొంత రూల్స్ అమలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇంజినీరింగ్ అధికారులకు దగ్గరగా ఉండే బడా గుత్తేదారులకు అనుకూలంగా వ్యవహరించడానికి కొత్త ఆంక్షలు పెడుతున్నారనే విమర్శలున్నాయి.



'కుడా' కార్యాలయం

మూడునెలల క్రితమే భద్రకాళి బండ్ గ్రీనరీ టెండరుపై వివాదం జరిగింది. మళ్లీ ఇప్పుడు ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి పనుల టెండర్ ప్రకటన(నోటిఫికేషన్) జారీ చేశారు. రూ.30.71 లక్షల గ్రీనరీ పనులు ఓ బడా గుత్తేదారుకు దక్కేలా కొత్త నిబంధన పెట్టారు. హైదరాబాద్ హెచ్ఎండీఏ, నగరపాలిక, పురపాలక సంస్థల్లో ఏడాది వ్యవధిలో మొత్తం రూ.30 లక్షల విలువైన పనులు చేసి ఉండాలనే నిబంధన ఉంది. కానీ! ఎల్కతుర్తి కూడలి పనులకు టెండర్ వేయాలంటే ఒకేసారి రూ.30 లక్షల విలువైన పనిచేసి ఉండాలనే తిరకాసు పెట్టారు. దీంతో చాలామంది గుత్తేదారులకు టెండరు వేసే అర్హత లేకుండా పోయింది. ఎక్కువ మంది టెండరులో పాల్గొంటే తక్కువ మొత్తం కోట్ చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రజాధనం ఆదా అయ్యే అవకాశం ఉంటుంది. 'కుడా' ఇంజినీరింగ్ విభాగం తీరుపై చిన్న గుత్తేదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు పనులపై అభ్యంతరం..

● ఎల్కతుర్తి బస్టాండ్ కూడలి విస్తరణ, గ్రీనరీ, లైటింగ్, ఇతర అభివృద్ధి పనుల కోసం రెండు ప్యాకేజీల్లో ఈ నెల 18న రాత్రి అంతర్జాలంలో ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. మొదటి పని రూ.30.71 లక్షల గ్రీనరీ టెండర్ నిబంధనలపై గుత్తేదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండోది రూ.28.92 లక్షల టెండర్ వివరాలు సరిగా లేవంటున్నారు.

● **అధికారులు ఏమంటున్నారంటే..:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు, తొందరగా పూర్తి చేసేందుకు కొత్త నిబంధనలు పెట్టామని 'కుడా' ఇంజినీర్లు అంటున్నారు. చాలామంది టెండర్ వచ్చాక పనులు చేయడం లేదంటున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో అల్లం నారాయణ, తదితరులు

భీమారం, న్యూస్‌టుడే: ఇటీవల గుండెపోటుతో మరణించిన సీనియర్ పాత్రికేయులు సుభాష్ మృతి జర్నలిజానికి తీరనిలోటని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హసన్‌పర్తి మండలం భీమారంలో ఆదివారం జరిగిన సుభాష్ సంతాప సభలో కడియం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణతో పాటు జర్నలిస్టు యూనియన్ నేతలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని, ఆతని పేరు మీద కమిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ కడియం కావ్య నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత, పలు సంఘాల నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
బాలసముద్రం 81438 11118
పరకాల 9849211303

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఉన్న మురుగు కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. - **రమేష్, స్థానికుడు**

● పంచాయతీ సిబ్బందితో మురుగుకాలువ శుభ్రం చేయిస్తాం. - **సత్యనారాయణ, తహసీల్దార్, శాయంపేట**

గోపాలపూర్, న్యూస్‌టుడే: హనుమకొండలోని సప్తగిరికాలనీలో రహదారిపై గుంతలు పడటంతో ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తోంది. - **యుగంధర్, చిరువ్యాపారి, సప్తగిరికాలనీ.**

● రహదారిపై గుంతలను రెండు మూడు రోజుల్లో పూడ్చి వేయిస్తాం. మురుగుకాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - **సిరంగి సునీల్‌కుమార్, కార్పొరేటర్, 56వ డివిజన్.**

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులోని ఎస్సీ కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - **మహేష్, కాలనీవాసి**

● సమస్యను పరిష్కరిస్తాం. -**శ్వేత, పంచాయతీ కార్యదర్శి**

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు నుంచి బ్రాహ్మణపల్లికి వెళ్లే రహదారి పక్కన పిచ్చిమొక్కలు పెరగడంతో అధ్వానంగా మారింది. - **దిలీప్, గ్రామస్థుడు.**

● సమస్యను పరిష్కరిస్తాం. - **రాజిరెడ్డి, ఏపీవో.**

భద్రకాళి సన్నిధిలో సీనియర్ పాత్రికేయులు



రంగంపేట, మట్టెవాడ, న్యూస్‌టుడే: భద్రకాళి అమ్మవారిని ఆదివారం సీనియర్ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి, కన్నా పర్శురాములు, కూన మహేందర్, రఘునాథ్, వేణుమాధవ్ రావు, డా.సీ.ఎస్.అప్పారావు తదితరులు దర్శించుకున్నారు. నగరంలోని ఓ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పూర్వ పాత్రికేయుల సమ్మేళనానికి వారు హాజరయ్యారు. వరంగల్ జిల్లాలో 1984 నుంచి 1995 వరకు ఉదయం దినపత్రికలో పనిచేసిన పాత్రికేయులు సమ్మేళనంలో పాల్గొన్నారు.

పాతబస్తీలో నేడు నీటి సరఫరా బంద్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మంరోడ్ వాల్ మార్ట్ వద్ద పైపులైన్ లీకేజీ పనులు కొనసాగుతున్నందున సోమవారం పాతబస్తీ ప్రాంతంలోని శివనగర్, ఆర్ఎస్‌నగర్, చింతల్, మిల్స్ కాలనీ, సాకరాశికుంట, ఎన్ఎస్‌నగర్‌లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ ఈఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు భరోసా నిధులు మంజూరు చేయాలి

ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారాస శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. -న్యూస్‌టుడే బృందం



కాజీపేట చౌరస్తాలో..



ములుకనూరులో..



ఎల్కతుర్తిలో..



కమలాపూర్‌లో..



పున్నేలు క్రాస్‌రోడ్డు వద్ద ...



పరకాలలో..



శాయంపేటలో..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పరకాల రూరల్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ మహిళ కూలి మృతి చెందిన సంఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన అబ్దుల్, ఆయన భార్య షేక్ షాహీన్, పిల్లలు కలిసి జీవనోపాధి కోసం పరకాల మండలం కామారెడ్డిపల్లికి 20 రోజుల క్రితం వచ్చారు. గ్రామ శివారులోని హనుమాన్ కాటన్ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. షేక్ షాహీన్ (48) ఆదివారం ఉదయం 6 గంటలకు మిల్లు ముందు ముఖం కడుక్కుంటుండగా గుడెప్పాడ్ నుంచి పరకాల వైపు వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

పరకాల, న్యూస్‌టుడే: పరకాలలో ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహన మెకానిక్ మధు (35) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. నడికూడ మండలం రాయపర్తికి చెందిన మేరుగు మధు(35) స్థానిక హుజూరాబాద్ రోడ్డులో మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పరకాల పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

క్రీడా పోటీలతో ప్రతిభ వెలుగులోకి



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

సుబేదారి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆర్ట్స్‌కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచిన వాగ్దేవి కళాశాల జట్టుకు ఆదివారం ఆయన ట్రోఫీ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా పోటీలతో ప్రతిభావంతులను వెలికితీయవచ్చన్నారు. కేయూ పరిధిలో జరిగే క్రీడలకు సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, పీఆర్ఆవో ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాడ్మింటన్ పోటీల్లో మొదటి బహుమతిని వాగ్దేవి కళాశాల, రెండో బహుమతిని సీకేఎం కళాశాల దక్కించుకున్నాయి. కోకో పోటీల్లో కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు ప్రథమ, కేడీసీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల ప్రథమ, వాగ్దేవి కళాశాల ద్వితీయ బహుమతి సాధించాయి.

పురస్కార గ్రహీతకు సీపీ అభినందన



లక్ష్మీప్రియను అభినందిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గతేడాది నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో పెండ్యాల లక్ష్మీప్రియ ప్రతిభ కనబర్చింది. ఇటీవల రాష్ట్రపతి చేతులమీదుగా బాలపురస్కార్ అవార్డును స్వీకరించింది. పోలీసు కమిషనరేట్‌లో ఆదివారం లక్ష్మీప్రియకు సీపీ అంబర్ కిషోర్ ఝా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. హనుమకొండకు చెందిన లక్ష్మీప్రియ గురువు సుధీర్ వద్ద నృత్యంలో శిక్షణ పొందుతోంది.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ జ్ఞానేశ్వర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా విద్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రతిభ ఆధారంగా అండర్-17 విభాగంలో బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పీఈటీ సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రఘువీర్, పీఈటీలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ.62,500 విలువైన 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. గీసుగొండ మండలం చిట్టిరెడ్డికి చెందిన కోళ్లఫారంలో 15 క్వింటాళ్లు, రెడ్డిపాలెంలో శౌరెడ్డికి చెందిన పందుల ఫారంలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ కోసం గీసుగొండ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి



కాజీపేట చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయొద్దంటూ ఆదివారం కాజీపేటలో తేజోమయి మాలమహానాడు సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని రాష్ట్ర కార్యదర్శి కొంద్ర నర్సింగరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎస్సీల వర్గీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో కార్పొరేటర్ నర్సింగరావు, మాలమహానాడు నేతలు బండి విజయ్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని మడికొండ అంబేడ్కర్ వార్డు కమిటీ అధ్యక్షుడు ఎడబొయిని ప్రభాకర్ డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మడికొండలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. దీని వల్ల మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. సంఘం నేతలు సారయ్య, కిషన్, మహేందర్, నాగేశ్, రమేశ్ పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడా పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. 25న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, పుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్, కరాటే, లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, ఈత, 26న ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చదరంగం, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, విలువిద్య, ఫెన్సింగ్.. వరంగల్ కాశీబుగ్గలోని ఓసిటి మైదానంలో జూడో పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 98492 10746 సంప్రదించాలన్నారు.

సొసైటీ వైస్ ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఐనవోలు, న్యూస్‌టుడే: నందనం సొసైటీ వైస్ ఛైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావును ఆదివారం మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకుడు అరూరి రమేష్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చందర్‌రావు కోడలు శ్వేత(35) మృతి చెందగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. దర్గా సొసైటీ ఛైర్మన్ వనం రెడ్డి, భాజపా, భారాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాకాల పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఖానాపురం, న్యూస్‌టుడే: పాకాల ప్రాముఖ్యతకు తగినట్లుగా పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పాకాలలో ఆయన పర్యటించారు. తూములు, కట్ట కింది భాగం, పంట కాలువలు, పిల్ల కాలువలను పరిశీలించారు. చారిత్రక నేపథ్యం ఉన్న పాకాలను జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వ్యూ పాయింట్, ఉద్యానవనం, తదితర ప్రత్యేక స్థలాలను పరిశీలించారు. పట్టణ పార్కుల అభివృద్ధిలో భాగంగా పాకాలకు ఇటీవల మంజూరైన రూ.50 లక్షలతో జిప్‌లైన్ పనులు, పార్కులు అభివృద్ధి చేస్తున్నట్లు స్థానిక నేతలు తెలిపారు. అంతర్జాతీయ కాలుష్య రహిత సరస్సుగా, ఔషధ వనంగా పేరుగాంచిందని అదే తరహాలో పర్యాటకులను ఆకర్షించేలా పనులు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఆయన వెంట పుర ఫ్లోర్ లీడర్ సాంబయ్యగౌడ్, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ హరిబాబు, డైరెక్టర్ మధుకర్, నేతలు రవీందర్‌రావు, రామానంద్, ప్రసాదరావు, లక్ష్మణ్, తిరుపతి, సాంబరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్, ఉపాధ్యాయులు

ఐనవోలు, న్యూస్‌టుడే: పోలీసు అమరుల వారోత్సవాలు పురస్కరించుకొని ఐనవోలు ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యువతపై మాదక ద్రవ్యాల వినియోగం.. దాని ప్రభావం అనే అంశంపై నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేసి అవార్డులతోపాటు నగదు పురస్కారం అందించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బాబు, సమ్మయ్య, పోలీసులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఫ్లెక్సీల ఏర్పాటు

వేలేరు, న్యూస్‌టుడే: నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వేలేరులో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్, తెలంగాణ అమరవీరుల స్తూపం, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ధర్మసాగర్: ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన పొలేపల్లి కరుణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కరుణాకర్ స్నేహితులు ఆదివారం ఆయన కుటుంబానికి రూ.40 వేల ఆర్థికసాయం అందజేశారు. వారు నారాయణగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరుణాకర్‌తో కలిసి చదువుకున్నారు. కార్యక్రమంలో స్నేహితులు సదానందం, కుమారస్వామి, లక్ష్మణ్, సత్యనారాయణ, యాదగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వైద్య సేవలు వెలకట్టలేనివి

మడికొండ, న్యూస్‌టుడే: సమాజంలో వైద్య సేవలు వెలకట్టలేనివని, వారిని కనిపించే దైవంలా ప్రజలు గౌరవిస్తారని విద్యావేత్త, కాళోజీ మిత్రుడు నల్ల ప్రభాకర్ అన్నారు. కాజీపేట మండలం మడికొండ ప్రజలకు 50 ఏళ్ల పాటు వైద్య సేవలందించిన ఆర్ఎంపీ డాక్టర్ యాదగిరిని మెట్టురామలింగేశ్వరస్వామి వెల్ఫేర్ సొసైటీ ఆదివారం కొండపై ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడారు. అనంతరం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ యాదగిరి, కార్యదర్శిగా బుర్ర వెంకటస్వామి, కోశాధికారిగా గురుపతి, తదితర కార్యవర్గాన్ని నియమించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా భారాస



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర, న్యూస్‌టుడే: భారాస కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దుర్గంపేటకు చెందిన భారాస కార్యకర్త చిల్ల తిరుపతి ఇటీవల మరణించాడు. పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు హనుమకొండలోని తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామక్రిష్ణ, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, నాయకులు కమలాకర్, మల్లయ్య, రఘుపతిరెడ్డి, దివాకర్, కొమురెల్లి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నడికూడ, న్యూస్‌టుడే: నడికూడ మండలం చర్లపల్లి, వరికోల్ గ్రామాలకు చెందిన పలువురు వివిధ కారణాలతో మృతి చెందగా.. ఆదివారం వారి కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. చర్లపల్లికి చెందిన గట్టు రాజయ్య, దావు రాజమ్మ, శీలం సమ్మక్క, పతంగి రాములు, ఎదులాపురం శేఖరయ్య, వరికోల్‌కు చెందిన పిట్ట రాజయ్య, బొళ్ల నర్సమ్మ, అల్లె బాలరాజ్, రాసమల్ల లక్ష్మి, పర్శ కొంరయ్య మృతి చెందగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దామెర, న్యూస్‌టుడే: పులుకుర్తి జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1991లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో కుసుమ సర్వేశం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా 'రైతు భరోసా' అమలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల రూరల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పక్కాగా రైతు భరోసా ఇస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీని జీర్ణించుకోలేక భారాస నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, దేవేందర్, కౌన్సిలర్లు జయమ్మ, సంపత్, మాజీ ఎంపీపీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరకాల నియోజకవర్గం

విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు

నడికూడ, న్యూస్‌టుడే: ఇంటి హద్దుల కొలతలు వేస్తుండగా విధులకు ఆటంకం కలిగించాడని నడికూడ మండలం కంఠాత్మకూర్‌కు చెందిన ఆకుల సుదర్శన్‌పై ఎంపీఓ చింతకుంట్ల చేతన్ కుమార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంఠాత్మకూర్‌కు చెందిన ఆకుల రాజేశ్వరి, వడ్లకొండ వెంకట్‌రెడ్డి, ఆకుల ప్రభాకర్‌లకు సంబంధించిన ఇంటి స్థలం విషయంలో గొడవలు జరగడంతో.. ఇంటి హద్దులను సరి చేయాలంటూ రాజేశ్వరి ఆగస్టులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈనెల 19న నడికూడ ఎంపీఓ చేతన్‌కుమార్, కంఠాత్మకూర్ పంచాయతీ కార్యదర్శి భార్గవి, సర్వేయర్ శంకర్‌లతో ముగ్గురి ఇళ్లకు హద్దుల కొలతలు వేస్తుండగా రాజేశ్వరి భర్త సుదర్శన్ విధులకు ఆటంకం కలిగించాడు. ఈ మేరకు ఎంపీవో చేతన్‌కుమార్ సుదర్శన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు దామెర ఎస్సై అశోక్ తెలిపారు.

గ్రేటర్‌లో నేడు ప్రజావాణి

కార్పొరేషన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అన్ని విభాగాల వింగ్ అధికారులు గ్రీవెన్స్ పెండింగ్, పరిష్కార వివరాలతో హాజరుకావాలని కోరారు.

గొర్రె చోరీపై కేసు నమోదు

దామెర, న్యూస్‌టుడే: దామెరకు చెందిన గొర్రెల కాపరి వంగ సంపత్ ఆదివారం తన గొర్రెలను గ్రామ శివారులో మేపుతుండగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఒక గొర్రెను అపహరించి పారిపోయారు. ఈ మేరకు బాధితుడు దామెర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

డ్రైవర్‌పై..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన ఎండీ సోయెల్ శనివారం ద్విచక్రవాహనంపై తన మేనత్త శన్నుతో కలిసి వెళ్తున్నాడు. తిరుమలగిరి శివారులో శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల రాజు ట్రాక్టర్‌పై వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సోయెల్, శన్నులకు తీవ్ర గాయాలుకావడంతో ఆసుపత్రికి తరలించారు. సోయెల్ తండ్రి యాకుబ్‌పాషా ఫిర్యాదు మేరకు ఆదివారం రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.